# రిలీవరు

తాసిల్దారు రాజేశ్వర్రావుకి తెగకోపం వచ్చింది.

రాని బస్సుమీద — వచ్చి నడినెత్తికెక్కి కూర్చున్న సూర్యుడిమీద — ఎప్పుడొస్తాడో తెలీని తన రిలీవరుమీద — తన ఉద్యోగం గజెట్ చేసిన గవర్నమెంటు మీద.

అసలు యీమధ్య జరిగిన దేదీ అతనికి నచ్చలేదు. ఇంతవరకూ స్వంత ఊళ్ళో, పుట్టినజిల్లాలో కాలుమీద కాలేసుకొని దర్జాగా రాజాలా ఉద్యోగం చేసుకునేవాడు.

తనుద్యోగం గజెట్ చేశాక, తొలిసారి తన జిల్లా, మరోమూడుజిల్లాలూ తిప్పించి బదిలీ చేశారు. "పిల్లకి పెళ్ళి చేసుకోవాలి బాబోయ్ ట్రాన్సఫ రాపం" డన్నాడు. "కొత్తఊళ్ళోనే చెయ్ పెళ్ళి" అన్నారు పై అధికార్లు. "వీళ్ళకిదే శాస్తి" అని నాల్నెల్లు శలవు పెట్టేశాడు, ఆవూరు తప్పించుకుందికి.

శలవ్ ఖర్చు తప్పిస్తే పిల్లకి పెళ్ళి కాలేదు, బదలీ తప్పలేదు. శలవాఖర్ని అక్కడికే, మళ్ళీ ఆవూరే వెళ్ళమని మొండిపట్టు పట్టింది గవర్నమెంటు

తన ఊరేం గొప్పదని కాదు. ఆ వూళ్ళో మిత్రుల్లా వుండే శత్రువులు, శత్రువుల్లా వుండే శత్రువులూ తప్పిస్తే మూడోరకం మనుషులు కన్పించరు అన్నిట్లోనూ పొలిటిక్స్! ప్రతిదాన్లో లిటిగేషన్.

కాని ఎంతచెడ్డా తన స్వంత వూరది. అందుకే దానిమీ దంతభిమానం తనకి. అందులోనూ తాసిల్దారు పనంటే తమాషాకాదు! కరణాల పేచీలతో, మునసబుల మడతలతో నిండిపోయుంటుంది.

మునసబు మీసం చూసి చెప్పెయ్యాలి వాడు మిసెప్రోప్రిమేటరో (Misappropriator) కాదో.

కరణం కళ్లు చూసి కనిపెట్టెయ్యాలి కల్టివేషనెకౌంటు కుకప్ (Cultivation account cook-up) చేస్తాడో లేదో.

ఆ వచ్చే కుర్రముండావాడు చస్తాడు

బీనాదేవి

